జీవితాన్ని ఆనందమయం చేసుకున్న అందమైన మనసులున్న వాళ్ళమీద సానుభూతి చూపడం?

# అందమైన మనసులు

## దాసు మధుర భారతి

ఏదో సామెత చెప్పినట్లు, వండుకున్నమ్మకు వొకే కూర- అడుక్కున్నమ్మకు అరు కూరలని. ఇల్లు మన సొంతది కానపుడు, దొరకాలే కాని అద్దె ఇళ్ళు ఎన్ని యినా మారవచ్చు. మనకు బోరు కొట్టినవుడు, ఇంటివాడికి యిష్టం లేనప్పుడు, ఎప్పుడు వడితే అపుడే.

మేము ఆ యింట్లోకి కొత్తగా వచ్చాం. ఇంటి వాళ్ళు (ఉత్తర ప్రదేశ్) యు. పి. వాళ్ళు. అడుగున క్రింది భాగంలో వుంటారు. మేము మేడ మీద. ఆ కాలనీ ఇళ్ళన్నీ సి ఆకారంలో వున్నాయి.మధ్యలో పార్కు. ఎదురుగుండా మెయిన్‌రోడ్డు. వచ్చేపోయే కార్లు, బస్సులు, జనంతో చాలా సందడిగా వుంటుంది. మా పోర్షన్ మధ్యలో వుందేమో అందరి బాల్కనీలు, లాన్‌లూ చక్కగా కనిపిస్తాయి, ఎవరింటికీ వెళ్ళకుండానే కావలసినంత కాలక్షేపం. నాకుమాత్రం చాలా నచ్చింది.

పొద్దున ఎనిమిదవుతోందేమో, వంట పని సగం అయింది నేను- బాల్కనీలో మంచిని క్రిందకి చూస్తున్నాను. మా ఇంటి వాళ్ళ లాన్ ఆకుపచ్చతివాసీ పరచినట్టుగా వుంది. అంచుల్లో వరసగా రకరకాల గులాబీ మొక్కలు విరగబూసిన పూలతో ఎంతో అందంగా వున్నాయి మధ్యలో చిన్న బల్ల, చుట్టూ నాలుగు గార్డెన్ చెయిర్స్ వేసి వుంచారు. అవి సామాన్యంగా తీయరు. అక్కడే వుంటాయి- ఎప్పుడో వానవస్తే తప్ప. నౌకరు టీ తెచ్చి పెట్టినట్లున్నాడు. ఆమె టీ కలుపుతోంది అతనితో మాట్లాడుతూ.

ఇంటిగలవాళ్ళు ముసలివాళ్ళేమో అనుకున్నానుగాని చాలా చిన్నవాళ్ళగా కనిపిస్తున్నారు ఆమె చాలా అందంగావుంది అతనూ వంటైలో పే వుంటాడు. దృఢంగా, ఆరోగ్యంగా వున్నాడు. దేన్ని గురించో నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో మా వారు "గడ్డానికి టయిమయింది, కాఫీ యేదీ!" అంటూ కేక పెట్టారు. పేపర్లలోనుంచి తల బయటికి పెట్టి. న్యూస్‌పేపరులో పనిచేస్తారు తను. అంచేత వూళ్ళో ప్రింటయ్యే డెయిలీలన్నీ (దాదాపు అరు) ఫ్రీగా వస్తాయి. లేస్తూనే పేపర్లన్నీ పక్కమీద పరుచుకుని పారాయణం ప్రారంభిస్తారు. ఒక మాటా మంతీ వుండదు.

"ఒక పేపర్లో చదివిందేగా మిగతా వాట్లో వుండేది. అంతంత సేపు ఏముంటుంది చదవటానికి! మంత్రిగారి ముక్కుమీద ఈగ వాలింది. కుడిచేత్తో తోలుకున్నారా లేక ఎడంచేత్తో తోలుకున్నారా అన్నదానికి అన్ని పేపర్లు చదవాలా! పేపరు మూస్తేనే కాఫీ" అన్నా నాకు చిరాకేసి

"కరెక్ట్. సరయిన పాయింటుకే వచ్చావు. ఏను పేపర్లు ఎడంచేత్తో తోలు



కున్నారని రాసి, మా పేపరు కుడి చెయ్యని రాసిందనుకో. యెంత గొడవో నీకేం తెలుసు? రేపు పార్లమెంటులో ఫలానా పేపరు. ఫలానా మంత్రిగారిమీద అవాకులు, చెవాకులు రాస్తోందంటారు. మన ఉద్యోగం కాస్తా ఊడిపోతుంది. అందుకని అన్ని పేపర్లూ అతి జాగ్రత్తగా చదవవలసిందే" అంటూ మళ్ళీ పేపర్లో దూరారు తను.

అంచేత నాకు వేరే కాలక్షేపం ఉండేది కాదు తనకి కాఫీ యిచ్చి నేను మళ్ళీ బాల్కనీలోకి వచ్చి క్రిందివాళ్ళ 'టీ' అయిందా. లేదా అని చూస్తున్నా. ఒకరవుండయినట్లుంది, రెండో చుట్టుకి మళ్ళీ కప్పుల్లోకి టీ వంపుతోంది ఆవిడ. అతను షాలు కప్పుకునే వుంటాడు ఎల్లవేళల్లోనూ. అతనికి ఒక చెయ్యి లేదని అన్నారు మావారు. బాగుండదని చెయ్యి విషయం అడగలేదన్నారు.

టీ తాగుతూ మధ్యలో ఆవిడ ఎందుకో లేవబోయి పడిపోయింది కుర్చీలో. వంగి చెక్క కాలు సరిగ్గా బెల్టుతో బిగించుకుని మామూలుగా నడుచుకుంటూ గులాబీలు చూడటానికి వెళ్ళింది. చూస్తున్న నాకెందుకో గుండాగినంత పనయింది. ప్రపంచంలో ఇంత ఘోరం ఎక్కడన్నా వుందా అనిపించింది. అతనికి చెయ్యి లేదు. ఆమెకు కాలు లేదు, ఏమిటీ విపరీతం? అనుకుంటూ మావారిని పిల్చి నేను చూసిన విషయం చెప్పాను. ఏదయినా ఏక్సిడెంటయి వుంటుందన్నారు తను. నాకైతే చాలా బాధేసింది. ఎంతో దిగులు, జాలి ఏ పనీ చెయ్యబుద్ధికాలేదు ఆ రోజంతా. ఒకటే ఆలోచనలు. ఎందుకయిందో. ఎట్లా అయిందో. ఎప్పుడయిందో తెలుసుకోవాలని ఒకటే ఇదిగా వుంది మనసులో. నిద్ర పట్టలేదు వారం రోజులదాకా

వాళ్ళని చూసినపుడల్లా 'పాపం కదా!' అనుకోవటం. మా వారేమో కోప్పడటం. "ఏమిటీ పాపం. పాపం అంటావు పదిసార్లు! అట్లా అనకూడదు. వాళ్ళంత హ్యాపీగా వున్న జంట, ఈ కాలనీలోనే లేదు. ఎప్పుడన్నా దిగులుగా వుండగా చూశావా వాళ్ళని? అలాటి వారిని చూసి ఆనందించాలిగాని జాలి పడకూడదు" అన్నారు.

నిజమే ఆ మాట ఎప్పుడు చూసినా నవ్వుతూ కనిపిస్తారు. లాన్‌లో కూచుని 'చెస్' ఆడుకుంటారు. కార్డ్సు ఆడుకుంటారు. ఇద్దరు పిల్లలు వాళ్ళకి. వాళ్ళతో కారమ్సు ఆడతారు. పార్కుకి తీసికెళ్తారు ఆడించటానికి. ఇంటికి ఫ్రెండ్సు వస్తారు. కలవడానికి వీళ్ళూ వెళ్తుంటారు. ఎప్పుడూ బిజీగా, హాయిగా, ఎంతో ఆనందంగా వుంటారు.

వాళ్ళని చూసినపుడల్లా యెందుకల్లా అయిందో తెలుసుకోవాలనే కోరిక మాత్రం రోజు రోజుకీ పెరుగుతోందేకాని తరగటంలేదు.

మావారి కొకటే చిరాకు. "ఏదైతే నీకెందుకు? వాళ్ళు హ్యాపీగా వున్నారు. అంతకంటె ఏం కావాలి యెవరికైనా. అలాంటి వారిమీద అనవసరంగా జాలిపడి వాళ్ళ మనో ధైర్యాన్ని దిగజార్చకూడదు. అట్లాంటి జాలి పలకరింపులు. సానుభూతులు వాళ్ళకి ఉపకారంకంటె అపకారమే యెక్కువ చేస్తాయి. వాళ్ళనెప్పుడూ అలా పరామర్శ చేయకు" అని గట్టిగా వార్నింగిచ్చారు.

"కావాలంటే కారణం అడిగి తెలుసుకో నీకంత ఆరాటంగా వుంటే. అంతేగాని, పాపం, జాలిలాంటి పదాలు వాళ్ళ ముందు రానీకు" అన్నారు తను






విజమే. మనలో చాలామంది కుంటి వాళ్ళని వెక్కిరించటం. చెవిటివాళ్ళని వేళాకోళం చేయటం. పిచ్చివాళ్ళని చూసి నవ్వటంలాటి వెకిలిచన్లు చేస్తారు. లేదా బోలెడు జాలిపడిపోవటం. అంతేగాని వాళ్ళకొక చేయూతనిచ్చి. ధైర్యం కలిగించి వాళ్ళజీవితాలని కూడా ఆనంద కరంగా చేయటానికి తగిన ప్రోత్సాహమివ్వరు. అట్లాంటి సహాయం. సహకారం వాళ్ళకి దొరికిననాడు— పిచ్చివాడినని. కుంటివాడినని. చెవిటివాడినని ఎవరూ తమని తాము తక్కువ చేసుకోరు. అలాంటి భావం వారిలో కలిగించటం ఎంత గొప్ప విషయం!

ప్రతి రోజూ ఉదయం ఎనిమిదికల్లా వాళ్ళు లాన్‌లో కూచుని టీ తాగటం, పైన బాల్కనీలో నుంచుని నేను కాఫీ తాగుతూ వాళ్ళని చూడటం నాకు బాగా అలవాటు అయింది. ఆ రోజు ఆదివారమేమో నా మొదటిసారి కాఫీ టైమ్ ఎనిమిదయిపోయింది. లేటవటంవల్ల.

అలవాటు ప్రకారం నా కాళ్ళు బాల్కనీలోకి వచ్చేశాయి. కాఫీ తాగుతూ కిందకు వంగి చూశాను వాళ్ళకోసం అదే టైములో ఆవిడా పైకిచూసి "నమస్తే! ఆయియె చాయ్ పీయెంగె." అంది. నేను నా కాఫీ మగ్గు చూపించాను. తాగుతున్నానన్నట్లుగా.

"మీరు కాఫీకదా తాగుతారు చాయ్ తాగుదురుగాని రమ్మ"ంది. వాళ్ళతో పరిచయం చేసుకోవాలనుకుంటున్న నేను ఆ అవకాశం వదులుకోదల్చుకోలేదు. దబదబా క్రింద కెళ్ళాను.

ఇద్దరూ లేచినుంచుని యెంతో మర్యాద చేసి కుర్చీ చూపించి కూర్చోమన్నారు. అతను 'టీ' పంపిస్తానని లోపలకు వెళ్ళిపోయాడు. "హింది మాట్లాడ్డం వచ్చా మీకు" అంది. "ఏదో కొద్దిగా వచ్చు" అన్నాను.

పరిచయం చేసుకోవాలన్న ఆత్రమే గాని. తీరా వెళ్ళాక మాట్లాడదామంటే నోటివెంట మాటలే కరువయినట్లుగా మూగదానిలా అయిపోయి ఎలా పలకరించాలా అని ఆమెనే చూస్తూ కూర్చున్నాను. అసలు సంగతి హిందీ అంత బాగా రాదుగదా. ఏం తప్పులు మాట్లాడతానో అని భయంగా వుంది.

నా బాధ అర్థం చేసుకున్నట్టుగా ఆమే పలకరించింది. "మీ వారు జర్నలిస్టటకదా! వెరీ ఇంటరెస్టింగ్ ప్రొఫెషన్. నాకు చాలా యిష్టం. నేనూ ఫ్రీలాన్సింగ్ చేస్తాను. ప్రెస్‌లో పని చేస్తారనగానే మీకు తప్పకుండా అడ్రెస్ ఇచ్చుకుని మావార్ని పోరాను. అసలు నేనే వద్దామ పరిచయం చేసుకోటానికి. మెట్లెక్కటం కొంచెం కష్టమవుతుంది నాకు అంచేత రాలేకపోయాను. మీవార్ని మీటవ్వాలి నా ఆర్టికల్స్ చూపించాలి" అంది గబగబా యెంతో చనువున్నదాన్లాగ.

ఇక నేను పుంతబట్టలేకపోయాను ఈ ఛాన్సుపోతే మళ్ళీ రాదేమో అన్నట్లుగా "ష్యూర్ తప్పకరండి. కాని మీ కాలికేమయింది? మీరేమీ అనుకోకపోతే నాకు తెల్సుకోవాలనుంది." అన్నా.

"అదొక పెద్ద కథ."

"అవి నేను కాలేజీలో ఎమ్. ఎ. చదువుకుంటున్న రోజులు. నన్నంతరూ చాలా అందంగా వుంటావనేవారు. కాలేజీ బ్యూటీ అనేవాళ్ళు ఇంటర్‌కాలేజియెట్ బ్యూటీ కంటెస్ట్‌లో ఆ ఏడు నేను ఫస్టు వచ్చాను.

అంతే. యిక మా ఫ్రెండ్సంతరూ 'మిస్ ఇండియా'కి పోటీ చెయ్యమని నన్ను ఊదరపెట్టేశారు. నాకిలాంటి వంటిగా యిష్టం లేదు. పైగా ఆ సంవత్సరం నా పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారు మావాళ్ళు ఎంగేజ్‌మెంట్ కూడా అయిపోయింది. అతనేమో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో పైలెట్."

"ఈ వరుణ్‌గారితోనేనా" అన్నాను నేను మధ్యలో ఆపి.

"అవును ఇతనే. తనే నా పేరు వర్ష అని పెట్టుకున్నారు. ఎంగేజ్‌మెంటప్పుడు తన పేరుకు మాచింగ్‌గా."

"ఎలగూ పెళ్ళి సెటిలయింది. ఇంకా బ్యూటీ కంటెస్ట్‌లేమిటి. అత్తవారు పూరుకుంటారా?" అని మా పేరెంట్స్ వొప్పుకోలేదు. కానీ నా ఫ్రెండ్స్ చాలా గొడవ చెయ్యటం మొదలెట్టారు. పర్మిషన్‌కోసం నన్ను వరుణ్‌కి రాయమన్నారు. లేదా తమేరాసి కనుక్కుంటామన్నారు. ఒకనాడు అందరూ కలిసి బలవంతంగా నన్ను కూచోబెట్టి నాచేత వరుణ్‌కిఉత్తరం రాయించారు.

తిరుగు టపాలో ఉత్తరం వచ్చింది. తప్పకుండా అందాల పోటీకి వెళ్ళమని. తన భార్య "మిస్ ఇండియా" అంటే తనకెంత గర్వంగా వుంటుందో ఊహకందని విషయమని. వెంటనే బొంబే వెళ్ళమని తనక్కడ కలుస్తానని రాశాడు.

"నేను బొంబే బయలుదేరాను మనసులో రకరకాల ఊహలు. ఒకవేళ "మిస్ ఇండియా"గా సెలెక్టయితే మళ్ళీ "మిస్ వరల్డ్"కి కూడా కంటెస్ట్ చెయ్యమంటారేమో. నో. నో. నాకిష్టం లేదని గట్టిగా చెప్పెయ్యాలీసారి. ఇదే ఆఖరి పోటీ. ఇకమీదట యెంతమాత్రం ఒప్పుకోకూడదు ....'ఇలా నా ఆలోచనలు తెగకముందే బొంబే వచ్చేసింది ప్లేన్. టాక్సీ మాట్లాడుకుని మా అంకుల్ వాళ్ళ అడ్రస్ చెప్పి పోనిమ్మన్నాను. మళ్ళీ నా ఊహా ప్రపంచంలోకి వెళ్ళిపోయాన్నేను. అంతే ఇంక నాకేం తెలీదు. తిరిగి హాస్పిటల్ బెడ్‌మీదే తెలివి వచ్చింది. అప్పటికి నాల్గు రోజులయిందిట. నేనెక్కిన టాక్సీకి ఆక్సిడంటయి నేను కళ్ళు తెరిచేటప్పటికి. మా పేరెంట్స్. అంకుల్. వరుణ్ ఒకరిద్దరు నా ఫ్రెండ్సూ. అందరూ ఆత్రంగా నావంకే చూస్తున్నారు. నా కుడికాలు క్రిందిభాగం తీసేసి వున్నారు. చెక్కకాలు తప్పనిసరి అయింది నాకు.

"మా పేరెంట్స్‌కి దిగులు పట్టుకుంది.

ఆడపిల్ల. అందులో అవిటిది. దీని జీవితమెలా వెళ్తుంది. పెళ్ళెలా అవుతుంది. ఎవరు చేసుకుంటారు. అంత విశాల హృదయం యెవరికుంటుంది? అని తమలో తామే కృంగిపోసాగారు. నేను బొంబేలో వున్నన్నాళ్ళూ వరుణ్ దాదాపు వస్తూనే వుండేవాడు.

మూడు నెలల తర్వాత నన్ను ఢిల్లీ తెచ్చేశారు. నన్ను చూడటానికి దాదాపు మా కాలేజీ అంతా వచ్చేసింది. నా ఫ్రెండ్సంతా నన్ను బలవంతంగా పంపించామే అన్న గిల్టీఫీలింగ్‌తో నన్ను చూస్తూనే దుఃఖం ఆపుకోలేక పెద్దగా ఏడ్చేశారు.

"ఇంతమంది నన్ను కావాలనుకునే వాళ్ళున్నపుడు ఒక్క కాలు లేకపోతే ఏమయిందని నాకనిపించిందా సమయంలో. అప్పటినుంచి నా దిగులు సగం తగ్గిపోయింది జరగాల్సిందేదో జరిగిపోయింది ప్రస్తుతం మన చేతుల్లో ఏమీలేదు. నేను దిగులుగా వుంటే నన్ను చూస్తూ మా పేరెంట్స్ జీవించగలరా? నేను దేవునిమీద భారంవేసి మొండిధైర్యం తెచ్చుకుని మామూలుగా వుండటాన్ని అలవాటు చేసుకున్నాను.

మళ్ళీ నా చదువు గొడవలో పడిపోయాను. వరుణ్ మాత్రం రెగ్యులర్‌గా నన్ను చూడటానికి వచ్చేవాడు. తను గనక ఫ్లైట్‌లో వుంటే నౌకరుచేత పూలు, పళ్ళు తప్పకుండా పంపేవాడు.

"రెండు, మూడు నెలల్లో చెక్క కాలుతో బాగానే నడవటం నేర్చుకున్నాను. మార్చిలో ఫైనల్ ఎగ్జామ్స్ రాసేశా. అనుకున్న ప్రకారం జూనులో పెళ్ళి జరగాలి.

"వరుణ్ ఎలాగూ చేసుకోడు. ఎందుకిన్నిసార్లు వస్తున్నాడు? అనవసరంగా నల్గురూ నాలుగు మాటలంటారు. పోనీ 'చేసుకుంటావా' అని అడగటానికి నోరు రాకుండావుంది" అని మా అమ్మా, నాన్నా బాధపడసాగారు 'ఎలా చెప్పాలా' అని.

నేనెలా చెప్పను రావద్దని, నా మనసొప్పలేదు. అందుకని నేనూ వూరుకున్నాను.

"ఒకనాడు వరుణ్ హడావిడిగా వచ్చాడు. "ఏమిటీ మీ వాళ్ళు పెళ్ళిమాటే యెత్తరు. 'మే' నెల సగం అయ్యేపోయింది వచ్చే నెలే గదా జూన్. పెళ్ళి పనులన్నీ కావటానికి టైం కావద్దూ" అన్నాడు గబగబా.

నేను ఆశ్చర్యంతో తలక్రిందులయిపోయాను. నోటివెంట మాటరావటంలేదు. సంతోషమో, దుఃఖమో మరి గొంతు పూడుకుపోయింది. కళ్ళ వెంబడి నీళ్ళు ధారగా కారుతున్నాయి. నా ఆనందానికి అవధుల్లేకుండావుంది. అందమయిన మనుషులేకాదు, మనసులుకూడా వుంటాయని అప్పుడే అనుకున్నాను. కాస్సేపటికి తేరుకుని నా స్వార్థాన్ని పక్కకునెట్టి "వరుణ్! చాలా సంతోషం! నువ్వా మాట అన్నందుకే నాకెంతో ఆనందంగావుంది. కాని నా స్వార్థం కోసం నీ జీవితం త్యాగం చెయ్యమనేటటువంటి దాన్ని కాదు నేను. నీకేం తక్కువ? ఎంతో మంచి మాచ్ వస్తుంది నీకు. నాకిప్పుడు పెళ్ళి మీద ఇంటరెస్ట్ లేదు. నేనీ మాట మనఃపూర్వకంగా అంటున్నాను. నువ్వు వేరే పెళ్ళి చేసుకో." అన్నాను.

"సరే అయితే, ఒక వేళ ఈ ఆక్సిడెంట్ నీకు గాక నాకు జరిగినట్లయితే నువ్వు నన్ను చేసుకునేదానివి కాదన్నమాట. అంతేగా. పోనీ మరో విషయం. మన పెళ్ళి అయ్యాకే ఈ ఆక్సిడెంట్ జరిగినట్లయితే ఏం చేసేదానివి? అందుకని పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి. పెళ్ళి ప్రయత్నాలు తొందరగా మొదలుపెట్టమని మీ వాళ్ళతో చెప్పు. నా తరపున వెడ్డింగ్ కార్డ్స్ పంపేశాను కూడా. నీకేం నగలు, చీరలు కావాలో అని అడిగి రమ్మన్నారు మా అమ్మా, నాన్న" అన్నాడు వరుణ్.

అంతర్జాతీయ వికలాంగుల సంవత్సర సందర్భంగా వికలాంగులకు అంకితం.

— దాసు మధురభారతి

"ఎప్పుడు వచ్చి నుంచున్నారో మా అమ్మా, నాన్నగారు అతని రెండుచేతులూ పట్టుకుని పెద్దగా ఏడిచేశారు. నాకూ దుఃఖం ఆగింది కాదు. అతన్ని తప్పుగా అర్థం చేసుకున్నందుకు క్షమించమన్నారు. ఏవేవో నేను చెప్పలేకపోయిన కృతజ్ఞతలన్నీ అతనిమీద క్రుమ్మరించేశారు. వాళ్ళ ఆనందానికి అద్దే లేకపోయింది.

నేను ఆఖరిసారిగా "వరుణ్ బాగా ఆలోచించుకో. నా మీద జాలితో మాత్రం చేసుకోకు. నిన్ను నేనేమీ తప్పు పట్టను. ఎవరి జీవితం వాళ్ళది. తర్వాత పశ్చాత్తాపడి లాభం వుండదు. నువ్వు సుఖంగా వుండటమే నాకు కావలసింది. నీలాంటి స్నేహితుడు దొరకటమే ఒకవరం. అంతకంటె నాకేమీ వద్దు" అన్నా.

"నాకేం జాలిలేదు నీ మీద. నీకే జాలి కాబోలు నామీద, నిన్ను చేసుకుంటానన్నందుకు! నాలాంటి స్నేహితుడు నీకు దొరకొచ్చునేమో. నీలాంటి భార్య నాకు దొరకద్దూ" అన్నాడు వరుణ్ నవ్వుతూ.

"జూన్‌లో మా పెళ్ళి జరిగిపోయింది అనుకున్నట్లుగానే. ఈ ఆరేళ్ళలో ఇద్దరు పిల్లలు. ఎంతో హాయిగా చీకూ చింతా లేకుండా వెళ్ళిపోతున్నాయి రోజులు. ఈ ఇల్లు మా నాన్నగారిచ్చిందే. అనుకున్నవన్నీ సవ్యంగా జరిగితే మన గొప్పేమిటి?


విధి మమ్మల్ని మళ్ళీ పరీక్షకు నిలబెట్టింది. పోయిన సంవత్సరం మా వారు నడిపే ఢిల్లీ నుంచి బొంబే వెళ్ళే విమానం క్రాష్ అయింది, వెదర్ బాగుండని కారణంగా. మా వారు చెయ్యి పోగొట్టుకున్నారు. నేను నా కాలు పోయినపుడు కూడా అంత బాధపడలేదు.

మావారు మాత్రం "దేవుడు మనల్ని ఇంకా ఆనందంగా, అన్యోన్యంగా వుండటానికే ఇలా జరిపించాడేమో! లేకుంటే నేను రోజూ ఆఫీసుకెళ్ళాలా, ఫ్లయిట్‌లో వెళ్ళినపుడల్లా నీకు భయంగా వుంటుందా లేదా. అలాంటి బాధలన్నీ లేకుండా హాయిగా, ఆనందంగావుంటున్నామా, లేదా" అంటూ నవ్వులాటకింకికి దింపుతారు. అన్నారు ఆవిడ నవ్వుతూ.

అందమయిన మనసులంటే వీళ్ళవేనని మరోమారు అనుకోకుండా వుండలేకపోయాను. ఇప్పుడు వాళ్ళని చూస్తే నాకు దిగులు, జాలి అనిపించదు. ఆనందంగా వుండటానికి అంగవైకల్యం అడ్డే కాదనిపిస్తుంది.

## పల్లెపడుచు

అడవి మల్లె —
సౌరభాలు వెదజల్లు



పల్లె పడుచు—
రంగుల హరివిల్లు

—పాయసం సుబ్రహ్మణ్యం